క్లుప్తంగా

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు



కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సతీష్‌కుమార్ యాదవ్

చిట్యాల: కేంద్ర మంత్రులుగా ఇటీవల పదవీ ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శుక్రవారం ఢిల్లీలో చిట్యాల పట్టణానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కంబాలపల్లి సతీష్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు కేంద్ర మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లక్కాల దీపక్‌రెడ్డి, కోరబోయిన వేణు, లింగాల హరిప్రసాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి శుక్రవారం ఇక్కడ విలేకరులకు వెల్లడించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థుల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న దండంపల్లి నికేశ్, పాక శ్రీవిద్యలు ఉన్నట్లు ఆమె తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు సంవత్సరానికి రూ.12 వేలు ఉపకార వేతనం అందుతుందన్నారు. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రోడ్డు విస్తరణకు సర్వే పనులు ప్రారంభం



సర్వే చేస్తున్న ప్రైవేటు సిబ్బంది

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి నుంచి బి.వెల్లెంల గ్రామానికి నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించేందుకు ప్రైవేటు సిబ్బందిచే సర్వే పనులు చేపడుతున్నారు. నార్కట్‌పల్లి – మునుగోడు రోడ్డులో 4/800 నుంచి 9/000 వరకు నాలుగు లేన్లుగా మార్చనున్నారు. బి.వెల్లెంల నుంచి నేరడ మీదుగా చిట్యాల వరకు డబుల్ రోడ్డు, బి. వెల్లెంల నుంచి కంచనపల్లి వరకు డబుల్ రోడ్డుగా విస్తరించనున్నారు. చిట్యాల నుంచి బి.వెల్లెంల ద్వారా నల్లగొండ వరకు రోడ్డు నిర్మాణ పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. సర్వే పూర్తి అయిన అనంతరం పనులు ప్రారంభం కానున్నాయని తెలిసింది.

డాక్టరేట్ పొందిన శ్వేతకు సత్కారం



ఎలికట్టెలో శ్వేతను సత్కరిస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన మిర్యాల శ్వేత బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందింది. ఆమెను శుక్రవారం కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగార్జున యాదగిరి, కొండ ఎల్లయ్య, కాటం వెంకన్న, రామకృష్ణ, ఉపేందర్, యాదగిరి, సంతోష్, సాయికుమార్ పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని ధర్నా



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణపరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం కెనరా బ్యాంక్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టి అనంతరం బ్యాంక్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం రైతులకు కొత్త రుణాలను అందించాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవినాయక్, రాగిరెడ్డి మంగారెడివ్వ, పోలేపల్లి గోవిందరెడ్డి, కోట్ల శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు స్థలమేదీ?

హరితహారానికి స్థలం కరువు
- మునుగోడు మండలంలో ప్రారంభం కాని పదో విడత..
- మండల వ్యాప్తంగా 1.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఇప్పటి వరకు 37వేల మొక్కలకే స్థలం గుర్తింపు



మునుగోడు మండలం గూడపూర్ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

మునుగోడు : మునుగోడు మండలంలో హరితహారం మొక్కలకు స్థలం కరువైంది. గడిచిన తొమ్మిది విడతలుగా రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ భూములు, కమ్యూనిటీహాల్స్‌లో మొక్కలు నాటుకుంటూ వచ్చారు. ప్రస్తుతం స్థలం కొరత కారణంగా జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావాల్సిన హరితహారం కార్యక్రమం మండలంలో నేటికీ ప్రారంభం కాలేదు.

లక్ష్యం 1.30లక్షలు

మునుగోడు మండల వ్యాప్తంగా ఉన్న 26 గ్రామ పంచాయతీల్లో 10వ విడత హరిత హారంలో 1.30లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. అందుకోసం ఆయా పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతీ నర్సరీలో 5వేల చొప్పున 1.30లక్షల వివిధ రకాల మొక్కలను పెంచారు. వీటిలో 90శాతం మేరకు మొక్కలు బతకడంతో ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికీ ఐదు చొప్పున 74వేల మొక్కలను పంపిణీ చేసి నాటించాలని నిర్ణయించారు. వీటిలో ప్రధానంగా పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయనున్నారు. మిగిలిన వాటిలో 64వేల మొక్కలను రోడ్లకు ఇరువైపులా, మరికొన్ని పల్లె ప్రకృతి వనాలు (పీపీవీ), మిగిలినవి బృహత్ పీపీవీలతో పాటు రైతుల గట్లతో పాటు తోటల్లో నిమ్మ, బత్తాయి, టేకు, తదితర మొక్కలు నాటాల్సి ఉంది.

స్థలాలకు అన్వేషణ

మండల వ్యాప్తంగా త్వరలో హరితహారం కార్యక్రమంలో ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. అందులో భాగంగా మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తిస్తున్నారు. ఆయా గ్రామాల్లో 37వేల మొక్కలకే ఇప్పటి వరకు అధికారులు స్థలాలను గుర్తించారు. అందులో 7వేల మొక్కలకు గుంతలు తీయించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన వాటికి కూలీల చేత గుంతలు తీయించడంతో పాటు స్థలాలను వెతుకున్నారు. కానీ లక్ష్యం మేరకు నాటే మొక్కలకు అవసరమైన స్థలం దొరకడం లేదని పలువురు ఉపాధిహామీ సిబ్బంది వాపోతున్నారు.

ఆక్రమణలో ప్రభుత్వ స్థలాలు?

మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీల్లో కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టా భూమి కలిగిన వారు తమ సర్వే నంబరుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి పంటలను సాగు చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇలా ప్రతి గ్రామంలో 10 నుంచి 50 చొప్పున మండల వ్యాప్తంగా సుమారు 300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కబ్జాకు గురైనా ప్రభుత్వ భూములను గుర్తించి వాటిలో హరితహారం మొక్కలు నాటించాలని పలువురు కోరుతున్నారు.

స్థలాలను గుర్తిస్తున్నాం



హరితహారంలో భాగంగా ఆయా గ్రామాల్లో లక్ష్యం మేరకు నాటాల్సిన మొక్కలకు అవసరమైన స్థలాలను గుర్తిస్తున్నాం. లక్ష్యం మేరకు నర్సరీల్లో 1.40 లక్షల మొక్కలు పెంచాం. ఇప్పటికే 37 మొక్కలు నాటేందుకు స్థలం గుర్తించి 7వేల గుంతలు తీయించాం. మిగిలిన మొక్కలకు అవసరమైన స్థలాలను త్వరలో గుర్తించి హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.
– పూజ, ఎంపీడీఓ, మునుగోడు

అన్యాక్రాంతమైన స్థలాలను గుర్తించాలి



మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమి వందల ఎకరాల్లో కబ్జాకు గురైంది. అధికారులు దానిని గుర్తించి అందులో హరితహారం మొక్కలు నాటించాలి. విద్యుత్ లైన్లకు తాకుతున్నాయని గతంలో నాటిన చెట్లను నరికివేస్తున్నారు. అలా కాకుండా ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటిస్తే ఇటూ భూమితో పాటు మొక్కలను కాపాడుకోవచ్చు.
– జిట్టగోని సైదులు, మునుగోడు

డబుల్ రోడ్డు పనులను అడ్డుకోవద్దు



చండూరు - తాస్కానిగూడెం రోడ్డు మధ్యలో కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

చండూరు : చండూరు మున్సిపాలిటీ పరిధిలో జరిగే డబుల్ రోడ్డు పనులను ఎవరూ అడ్డుకోవద్దని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎవరికైనా నష్టం జరిగితే పరిహారం అందించే బాధ్యత తనదేనని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న డబుల్ రోడ్డు పనులను వర్షంలో సైతం ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజా ప్రయోజనాల కోసం జరుగుతున్న అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అభివృద్ధి మాత్రం వేగంగా ముందుకు తీసుకుపోతానన్నారు. వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ పరిధిలో నీరు నిలబకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్‌ను ఆదేశించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ లేకుండా చూస్తానన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

అభివృద్ధి విషయంలో ఎవ్వరు నిర్లక్ష్యం వహించినా సంహించేది లేదని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి అనుకూలంగా పనిచేయని వారు తీరు మార్చుకోవాలి..లేని పక్షంలో బదిలీపై వెళ్లవచ్చని ఆయన సూచించారు. సమావేశంలో మున్సిపల్‌కమిషనర్ మణికరణ్, అనంత చంద్రశేఖర్, కోడి శ్రీనివాసులు, దోటి వెంకటేశ్‌యాదవ్, పల్లె వెంకన్న, నల్లగంటి మల్లేశం, ఇరిగి రాజు, రవికుమార్, ఇరిగి వెంకటేశం, కావలి అంజనేయులు, తదితరులు ఉన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లలో జీహెచ్‌ఎం పోస్టులు భర్తీ

శాలిగౌరారం: మండలంలో సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న తొమ్మిది జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్‌ఎం) పోస్టుల భర్తీ జరిగినట్లు ఇంచార్జి ఎంఈఓ నాగయ్య శుక్రవారం తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ జరిగిన పాఠశాలల్లో శాలిగౌరారం, ఆకారం, వల్లాల, భైరవునిబండ, మనిమద్దె, చిత్తలూరు, ఇటుకులపహాడ్, మాధారంకలాన్, ఊట్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో శాలిగౌరారం-కె.మల్లయ్య, ఆకారం-కె.మహేశ్వర్, వల్లాల-కె.రవీందర్, భైరవునిబండ-ఎస్.విజయనిర్మల, మనిమద్దె-ఎం.శ్రీనివాసులు, చిత్తలూరు-ఆర్.జ్యోతి, ఇటుకులపహాడ్-కె.రామాచారి, మాధారంకలాన్-రామలింగాచారి, ఊట్కూరు-ఏ.వెంకన్న నియమితులయ్యారు. ఇదిలా ఉండగా మండలంలో మొత్తం 12 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా అడ్లూరు, పెర్కకొండారం పాఠశాలలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. గురుజాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లేక గత సంవత్సరం మూతబడింది.

నీటి సరఫరా పనులపై విచారణ చేపట్టాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో మిషన్ భగిరథ పథకంలో మంచినీటి సరఫరాకు చేపట్టిన నిర్మాణ పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని కోరుతూ ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి సిద్ది వీర సోమయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఉరుమడ్లలోని అన్ని వార్డులో పూర్తి స్థాయిలో మిషన్ భగిరథ పథకంలో నీటి సరఫరాకు నిర్మాణ పనులు చేయకున్నా చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారన్నారు. ఈ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఇప్పటి వరకు గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగిరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు కోనేటి యాదగిరి, గ్రామ అధ్యక్షుడు చెరుకు సైదులు, పల్లపు బుద్ధుడు, పట్ల జనార్దన్, కురుపటి లింగయ్య, బొడ్డు శ్రీను, జనపాల శ్రీను, పాకాల దినేష్, మేడబోయిన శ్రీనువాస్, గాంగపురం వెంకన్న, గుత్తా రవీందర్‌రెడ్డి, రూపని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికి పెందోట బాల సాహిత్య పురస్కారం



కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి

చండూరు : చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి పెందోట బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు శ్రీవాణి సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు తెలిపారు. 2024 సంవత్సరానికి గాను బుచ్చిరెడ్డి బాలల కోసం రాసిన బంతిపూలు కథల సంపుటి నల్లగొండ జిల్లా నుంచి ఎంపిక చేసినట్లు తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాల కింద 13 మంది కవులు, రచయితలు ఎంపికైనట్లు వీరందరికీ త్వరలో సిద్దిపేటలో జరిగే సంస్థ పదో వార్షికోత్సవంలో నగదు, శాలువా, జ్ఞాపికలతో పాటు పురస్కారాన్ని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుచ్చి రెడ్డి పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల భిక్షం, ఉపాధ్యాయులు, కవులు రచయితలు వివిధ సంఘాల ప్రతినిధులు బుచ్చిరెడ్డిని అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు

- ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి



ఓగోడులో చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగధర్‌రావు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలం నోములు, ఓగోడు, పాలెం, వల్లాభాపురం గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూళ్లలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మిర్యాల చల్మరాజు, పోతుల వంటల వెంకటేశ్వర్లు, గోపాల్, సైదులు, ఎంపీటీసీలు షేక్ యాస్మీన్ నయిం, లోడె సాగర్, సామ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఐదుశాతం రిజర్వేషన్ కల్పించాలి



బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోలి ప్రభాకర్

నల్లగొండ టూటౌన్ : పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు దివ్యాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం తీసుకురావాలిన కోరుతూ తెలంగాణ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ శుక్రవారం కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి వీరేంద్రకుమార్, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 70శాతం శారీరక అంగవైకల్యం ఉన్న వారందరికీ త్రిచక్ర మోటరు వాహనాలు అందించాలని, ఇండ్లు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మహేశ్వరి, వెంకటేశ్, శంకర్ ఉన్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మర్రిగూడ : తాటి చెట్టు పైనుంచి కిందపడి గాయపడడంతో దివ్యాంగులకు మారిన గీత కార్మికులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే గీత కార్మికలకు ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలని కోరారు.

చిత్తలూరులో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వీధుల్లోనే మురుగునీరు పారుతోంది. దీంతో ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. చిత్తలూరు గ్రామపంచాయతీ పరిధిలో 12 వార్డులు ఉండగా 900 నివాస గృహాలు, 4300 మంది జనాభా, 2920 మంది ఓటర్లు ఉన్నారు. మూసీనది ఒడ్డున ఉన్న ఈ గ్రామం పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామం.



చిత్తలూరు 3వ వార్డులోని ఓ వీధిలో పారుతున్న మురుగునీరు



చిత్తలూరులో ఇళ్ల ముందు ఇలా..

అధ్వానంగా డ్రెయినేజీ..

చిత్తలూరు గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు వీధుల్లోనే పారుతుంది. వీధుల్లో మురుగునీరు పేరుకుపోయి ప్రవహించడంతో దుర్వాసన వస్తుండటంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ఆధిపత్యపోరుతో పట్టించుకోకుండా..

గ్రామంలో ప్రజాప్రతినిధుల మధ్య తలెత్తిన రాజకీయ ఆధిపత్యపోరుతో పాలకులు గ్రామాభివృద్ధిపై దృష్టిని సారించలేకపోయారు. దీంతో గ్రామ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తికావడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నా గ్రామపంచాయతీలో నిధులలేమి సమస్య అటు ప్రజలను ఇటు అధికారులను వేధిస్తుంది.

అనారోగ్యాల పాలవుతున్నాం



మా వీధిలో సైడ్‌డ్రెయినేజీ లేకపోవడంతో ఇంటిముందు మురుగునీరు నిలుస్తోంది. దుర్వాసనతో విషజ్వరాల బారిన పడుతున్నాం. దీంతో ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా నష్టపోతున్నాం.
– రాచమల్ల మణెమ్మ, చిత్తలూరు.

పట్టించుకున్న నాథుడే లేడు



వీధుల్లో మురుగునీరు నిలుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. నాడు సర్పంచ్, ఎంపీటీసీలకు ఎన్నోసార్లు వివరించాం. నేడు ప్రత్యేక అధికారులకు కూడా విన్నవించినా పట్టించుకోవడం లేదు.
– బందారు శంభయ్య, చిత్తలూరు.

నిధుల లేమితో..



గ్రామంలోని వీధుల్లో మురుగునీరు పారుతున్న విషయం వాస్తవమే. 3వ వార్డు బజారులో సీసీ కింద వేసిన సిమెంట్‌పైపు పగిలి పోవడంతో మురుగు నీరు నిల్వ ఉంటోంది. నిధుల కొరత కారణంగా సమస్యను పరిష్కరించలేకపోతున్నాం.
– రామదాసు, ప్రత్యేక అధికారి, చిత్తలూరు

తాళ్లవెల్లెంల వాసికి డాక్టరేట్



కొంపెల్లి వెంకటేశ్వర్లు

చిట్యాల: మండలంలోని తాళ్ల వెల్లెంల గ్రామానికి చెందిన కొంపెల్లి వెంకటేశ్వర్లుకు గ్రంథాలయ శాస్త్రంలో చేసిన పరిశోధనకుగాను ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు శుక్రవారం డాక్టరేట్ ప్రకటించారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ దామోదర్‌గౌడ్ పర్యవేక్షణలో గ్రంథాలయ శాస్త్రంలో యూస్ ఆఫ్ లైబ్రెరీ రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ ఇన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ తెలంగాణ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఆయన ప్రస్తుతం గురుకుల పాఠశాలలో గ్రంథ పాలకుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఫ్యామిలీ సర్వే పరిశీలన

చిట్యాల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గుండ్రాంపల్లి, సుంకేనేపల్లి, ఏపూరు గ్రామాల్లో చేపడుతున్న ఫ్యామిలీ సర్వేను శుక్రవారం హెచ్‌ఓడీ ప్రత్యేక మానిటరింగ్ అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ శాఖలోని కుటుంబాల సంఖ్య, గ్రామ హెల్త్ రిజిస్టర్‌లో నమోదైన కుటుంబాల సంఖ్య మధ్య వ్యత్యాలను తొలగించి సరి చేయాలని బృందం సభ్యులు ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సక్కుబాయి, హెచ్‌ఓడీ మానిటరింగ్ బృందం సభ్యులు జ్యోతి, ప్రభావతి, సీడీపీఓ కవిత, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్‌లు రోజ, పారిజాత, డీసీ సతీష్, కోఆర్డినేటర్ మల్లారెడ్డి, అంగన్‌వాడీ టీచర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్స్ పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి

చిట్యాల: చిట్యాల మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పది మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎం(గెజిటెడ్ హెడ్‌మాస్టర్)లుగా పదోన్నతి పొందారు. వారిలో ఆయా పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌లుగా పనిచేసిన యానాల నర్సిరెడ్డి, జి.శేఖర్‌రెడ్డి, కత్తుల ఉదయ, శేపూరి నర్సింహా, కాలం అనుణకుమారి, బోగోజు రామలింగాచారి, పగిడిపాటి నర్సింహా, శంకుతల, దాసోజు జ్ఞానేశ్వరచారి, రావుల వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వీరంతా గురువారమే తమకు కేటాయించిన వివిధ ప్రాంతాల్లోని ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని ఆదుకోరూ..



మర్రిగూడ మండల కేంద్రంలో ఉంటున్న మతిస్థిమితం లేని వ్యక్తి

మర్రిగూడ: స్థానిక బాష రాదు, మనసులోని బాధలు చెప్పుకోలేని మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి కొంతకాలంగా మర్రిగూడ మండల కేంద్రంలోని చౌరస్తాలో తిరుగుతున్నాడు. ఆకలి వేసినా, అవసరం ఉన్నా ఎవరినీ ఏమి అడగలేడు. ఎవరైనా జాలిపడి భోజనం పెడ్తేనే తింటూ జీవిస్తున్నాడు. తనకు సంబంధించిన కొన్ని వస్తువులను బస్తాలో వేసుకుని ఎండకు, వానకు తిరుగుతుండడంతో అతని ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మొదట్లో అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ పలువురు దూరంగా వెళ్లాలని సూచించడంతో ఇటీవల నుంచి కాస్త శుభ్రంగా ఉంటున్నాడు. అధికారులు స్పందించి అతని వివరాలు సేకరించి వారి బంధువుల వద్దకైనా పంపించాలని, లేనట్లయితే ఏదైనా ఆశ్రమంలో చేర్పించి ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగులకు బాసటగా.. స్టడీ సెంటర్





నకిరేకల్ : వాసవీ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో చదువుకుంటున్న నిరుద్యోగులు

- నకిరేకల్‌లో 'లిటిల్ సోల్జర్స్' ఆధ్వర్యంలో నిర్వహణ
- అందుబాటులో పోటీ పరీక్షల మెటీరియల్
- కేంద్రానికి ప్రతి రోజు 50 నుంచి 60 మంది నిరుద్యోగులు రాక

నకిరేకల్ : నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత స్టడీ సెంటర్ రోజు రోజుకూ ఆదరణ పొందుతోంది. 17నెలలుగా ఈ సెంటర్‌ను ఎంతో మంది నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. శుక్రవారంతో ఈ సెంటర్ ప్రారంభించి 500 రోజులు పూర్తి చేసుకుంది. స్థానిక వాసవీ కళాశాలలో లిటిల్ సోల్జర్స్, వాసవీ ఫౌండేషన్ వారు సంయుక్తంగా స్టడీ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రస్తుతం నడవక పోవటంతో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు వాసవీ పౌండేషన్ వారిని ఒప్పించి 17 నెలల క్రితం ఉచిత స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. చదువుకోవడానికి చైర్స్, బెంచీలు సమకూర్చారు. పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ విభాగాల స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు. తాగు నీటి వసతి కూడా ఏర్పాటు చేశారు. ఇంటి వద్ద ఉద్యోగాలకు సన్నద్ధం కాలేని వారు ప్రతి రోజు ఈస్టడీ సెంటర్‌కు వచ్చి వెలుతున్నారు. ప్రతి రోజు ఈ సెంటర్‌లో 50 నుంచి 60 మంది వచ్చి చదువుకుంటున్నారు. ఈసెంటర్‌ను వినియోగించుకున్న వారికి ఇప్పటి వరకు పోలీస్ కానిస్టేబుల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు, గ్రూప్-4, గురుకులం, నర్స్ వంటి ఉద్యోగాలు పొందారు. చాలా మంది గ్రూప్-1, టెట్ అర్హత సాధించారు.

పోటీ పరీక్షలు పూర్తయ్యేంత వరకు..



లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ స్థాపించి అటు పేద వారికి సహాయ సహకారాలు అందిస్తూ ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉచిత స్టడీ సెంటర్‌ను ప్రారంభించాం.ఈ సెంటర్ నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోంది. పోటీ పరీక్షలు పూర్తయ్యేంత వరకు సెంటర్‌ను కొసాగిస్తాం.
– బ్రహ్మదేవర నరేష్, లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి